నేడు యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో నవంబర్ పదో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని తెలిపారు.

గ్రంథాలయానికి..
'గూడు' కట్టండయ్యా..!

- శిథిలావస్థలో జిల్లా గ్రంథాలయ భవనం
- రోజూ 200 మంది పాఠకులు వస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- కొత్త భవన నిర్మాణ కోసం రూ.2.99 కోట్లతో ప్రతిపాదనలు
- తాత్కాలిక వసతి కోసం గ్రంథాలయ అధికారుల తిప్పలు
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న దుస్థితి
- ప్రత్యేక అధికారి లేరాయే
- స్థానిక సంస్థల నుంచి రావాల్సిన చెస్ బకాయి సొమ్ము దాదాపు రూ.20 కోట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంతోమంది విద్యార్థులకు, నిరుద్యోగులకు, పుస్తక ప్రియులకు, పత్రికలు చదివే పాఠకులకు విజ్ఞానాన్ని అందించే జిల్లా గ్రంథాలయం దుస్థితి అత్యంత ఘోరంగా మారింది. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా గ్రంథాలయం దిక్కులేని స్థితికి చేరింది. శిథిలావస్థకు చేరిన భవన స్థానంలో కొత్త భవన నిర్మాణం కోసం గ్రంథాలయ అధికారులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతంగా మారాయి. కొత్త భవన నిర్మాణం, అప్పటి వరకూ తాత్కాలిక వసతి కోసం గ్రంథాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరులోని జిల్లా గ్రంథాలయం దశాబ్దాల తరబడి ఎంతో మందికి విజ్ఞానాన్ని పంచుతోంది. ఎంతో మంది నిరుద్యోగులు ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు సైతం సాధించారు. ఇప్పటికీ ప్రతిరోజూ 200 మంది ఈ గ్రంథాలయానికి పుస్తక ప్రియులు వస్తుంటారు. అన్ని పత్రికలూ ఇక్కడకు వస్తాయి. గ్రంథాలయంలో పాఠకులు చదువుకునేందుకు లక్షా 60 వేల వరకూ పుస్తకాలు ఉన్నాయి. ఏలూరు నగర ప్రజలతోపాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు విజ్ఞాన్ని అందించే గ్రంథాలయాన్ని అధికారుల నిర్లక్ష్యంతో చిదిమేస్తున్న దుస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న జిల్లా గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షపు నీరు రావడంతో పైఅంతస్తును పూర్తిగా ఖాళీ చేసిన పరిస్థితి ఏర్పడింది. శిథిల భవనం పడగొట్టి కొత్త భవనం నిర్మించాలని గ్రంథాలయ అధికారులు ఎప్పటినుంచో ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను కోరుతూనే ఉన్నారు. ఎట్టకేలకు రూ.2.99 కోట్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. కొత్త భవనం నిర్మించాలంటే గ్రంథాలయాన్ని తాత్కాలికంగా వేరేచోటకు మార్చాల్సి ఉంది. దీనికోసం ఏలూరులోని సైన్స్‌పార్క్‌లో భవనం, వ్యవసాయశాఖకు చెందిన పాత భవనం ఉన్నాయి. వీటిలో ఏదైనా భవనం తాత్కాలికంగా ఇవ్వాలని, లేకపోతే వేరేచోట వసతి కల్పించాలని గ్రంథాలయ అధికారులు ఎంపీ, ఎంఎల్ఎ, జిల్లా పరిషత్ చైర్మన్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులందరినీ కలిసి వేడుకుంటున్నారు. గ్రంథాలయం గురించి ఏ ఒక్కరూ ఆలోచించని పరిస్థితి నెలకొంది. దీంతో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనంలోకే జనం వెళ్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గ్రంథాలయ ఛైర్మన్‌ను నియమించలేదు. నిబంధనల ప్రకారం అప్పటి వరకూ ప్రత్యేక అధికారిని నియమించాలి.

శిథిలావస్థకు చేరిన జిల్లా గ్రంథాలయ భవనం

గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు

గతంలో జాయింట్ కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉండేవారు. గడువు పూర్తయినా ప్రత్యేక అధికారి నియామకం జరగలేదు. దీంతో గ్రంథాయలం గురించి పట్టించుకునేవారే లేకుండా పోయారు. ప్రజలకు విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయం పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

నిధులు గురించి పట్టించుకోని పరిస్థితి..

జిల్లా గ్రంథాలయానికి అనుబంధంగా జిల్లా వ్యాప్తంగా 72 గ్రంథాలయాలు ఉన్నాయి. ఎంతో మంది చదువరులు ఈ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేస్తున్నారు. మున్సిపాల్టీలు, పంచాయతీలకు వచ్చే పన్నుల నుంచి నూటికి ఎనిమిది పైసలు గ్రంథాలయాలకు ఇవ్వాల్సి ఉంది. ఆ సొమ్ములు కూడా సరిగ్గా ఇవ్వడం లేదు. ఏలూరు కార్పొరేషన్ నుంచి రూ.పది కోట్లు బకాయి గ్రంథాలయానికి ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. మిగిలిన మున్సిపాల్టీలు, పంచాయతీల నుంచి మరో రూ.పది కోట్ల వరకూ రావాల్సి ఉంది. దాదాపుగా రూ.20 కోట్లు బకాయిలు ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. ఉద్యోగులకు జీతాలు, కొత్త పుస్తకాలు కొనుగోలు, భవన నిర్మాణం ఏది చేయాలన్నా స్థానిక సంస్థల నుంచి వచ్చే నిధులే ఆధారం. అయినప్పటికీ గ్రంథాలయాల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లా గ్రంథాలయం కొత్త భవన నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాత్కాలిక వసతి ఏర్పాటుపైన వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకపోతే విజ్ఞాన భాండాగారం పరిస్థితి అత్యంత ఘోరంగా మారనుంది.

బెల్టు షాపులపై ఉక్కుపాదం

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు జిల్లాలో బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య తెలిపారు. జిల్లాలో మొత్తం ఎన్ని మద్యం, షాపులు, బార్లు ఉన్నాయి, అమ్మకాలు ఎలా ఉన్నాయి, నకిలీ మద్యంపై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు, బెల్ట్ షాపులు అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.



ప్రశ్న : జిల్లాలో మొత్తం ఎన్ని మద్యం షాపులు, బార్లు ఉన్నాయి?

జిల్లాలో మొత్తం 155 మద్యం షాపులు ఉన్నాయి. అందులో 141 ఓపెన్ గాను, 14 గీత కులాలకు కేటాయించడం జరిగింది. అలాగే 13 బార్లు ఉన్నాయి. అందులో రెండు గీత కులాలకు కేటాయించడం జరిగింది.

ప్రశ్న : ఈ మధ్యకాలంలో నకిలీ మద్యం తయారీ రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో నకిలీ మద్యం అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

నకిలీ మద్యం తయారీ జిల్లాలో ఎక్కడా లేదు. అయినప్పటికీ ప్రజల అనుమానాలను నివృత్తి చేసి ప్రజలకు భరోసా కల్పించేందుకు ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం నకిలీదా కాదా అనేది నిర్ధారించుకోవచ్చు. ఈ యాప్‌పై కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయడం జరిగింది. ప్రతి దుకాణం వద్దా వాల్ పోస్టర్లు అంటించి కరపత్రాలు అందుబాటులో ఉంచాం.

ప్రశ్న : జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

నాటు సారా తయారీ అమ్మకం రవాణా వంటి వాటిపై విస్తృతంగా దాడులు చేసి పూర్తిస్థాయిలో అరికట్టాం. జిల్లాలో 140 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగింది. ముగ్గురిపై పిడి యాక్ట్ అమలు చేసి వారిని జైలుకు పంపించాం.

ప్రశ్న : నాటుసారాను అరికట్టేందుకు ఎలాంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

జిల్లాలో నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా వంటివి వాటిని అరికట్టేందుకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. అంతేగాక మార్పు కార్యక్రమం ద్వారా నాటుసారా తయారీ నుంచి బయటకొచ్చిన 40 కుటుంబాలకు 31 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించాం. దీని ద్వారా వారు రకరకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ప్రశ్న : జిల్లాలో విస్తృతంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ప్రచారం సాగుతున్న నేపథ్యంలో బెల్ట్ షాపులు అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో బెల్టు షాపులపై విస్తృతంగా తనిఖీలు చేపట్టాం. జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో అక్టోబర్ 17వ తేదీ నుంచి నవంబర్ 4వ తేదీ వరకూ 58 కేసులు నమోదు చేసి 45.54 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకున్నాం. ఎక్కడ బెల్ట్ షాపులు నిర్వహించినా వారికి సరుకు సప్లై చేసిన షాపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే ప్రజలు సంబంధిత ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించాం.

ప్రశ్న: జిల్లాలో గత జనవరి నుంచి నాటుసారా విషయంలో మొత్తం ఎన్ని కేసులు నమోదు చేశారు, ఎంత సారా సీజ్ చేశారు, ఎన్ని వాహనాలను సీజ్ చేశారు?

జిల్లాలో గత జనవరి నుంచి నాటు సారా విషయంలో 428 కేసులు నమోదు చేసి 631 మందిని అరెస్టు చేశాం. అలాగే 4111 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసి 57 వాహనాలను సీజ్ చేశాం. అలాగే 94,120 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశాం.

ప్రశ్న : జిల్లాలో గత జనవరి నుంచి ఇతర ఏయే విషయాల్లో ఎన్ని కేసులు నమోదు చేశారు?

జిల్లాలో జనవరి నుంచి బెల్టు షాపులకు సంబంధించి 325 కేసులు నమోదు చేసి 324 మందిని అరెస్ట్ చేశాం. అలాగే 429.25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. అలాగే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విషయంలో మూడు కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేశాం.

ప్రశ్న : జిల్లాలో గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు, ముఖ్యంగా యువతలో గంజాయి అలవాటు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా గంజాయి అమ్మకాలు లేవు. యువత గంజాయి బారిన పడకుండా పాఠశాలల్లో, కళాశాలల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేయడం జరుగుతుంది. జిల్లాలో ఎక్కడైనా గంజాయి అమ్మకాలు, బెల్టు షాపులు వంటివి కనిపిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఏలూరులో బాలోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హేలాపురి బాలోత్సవాల పిల్లల ఆరో సంబరాలు ఏలూరులోని సెయింట్ జేవిఆర్ బాయ్స్ కాన్వెంట్లో ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, పద్యాలు, డ్రాయింగ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకూ ఏలూరు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ బాల బాలికలు కూడా పాల్గొన్నారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ రెండు కేటగిరిల్లో ఈ పోటీలు నిర్వహించారు. ప్రారంభ సభకు ఆహ్వాన కమిటీ ఛైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వరలక్ష్మి మాట్లాడుతూ బాలల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు, వారిలో పోటీ తత్వాన్ని పెంచేందుకు ఇలాంటి బాలోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మిగతా ముఖ్య కార్యక్రమాలు 50 అంశాల్లో వచ్చే నెల 12, 13వ తేదీల్లో వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ విద్యాలయంలో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. వచ్చేనెల 14వ తేదీన సర్ సిఆర్ఆర్ విద్యాసంస్థల ఆడిటోరియంలో పోటీల్లో ఉత్తమ ప్రతిభాను కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని తెలిపారు. నిర్వహణ కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సంబరాల నిర్వహణ కమిటీ నాయకులు మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థులతో నిర్వాహకులు

జూద క్రీడలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నూజివీడు నియోజకవర్గం జూదాలకు అడ్డాగా మారిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని, పేకాట, కోడి పందాలను ఉక్కుపాదంతో అణిచివేసి, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నూజివీడు నియోజకవర్గంలో జూదాలు పెరిగాయని స్థానిక ఎంఎల్ఎ, రాష్ట్ర మంత్రి పార్థసారథి పోలీసులను హెచ్చరించడం చూస్తుంటే ఏ స్థాయిలో పేకాట, కోడి పందాలు నిర్వహిస్తున్నారో అర్థమవుతుందని తెలిపారు. ప్రతి మండలంలో యథేచ్ఛగా పేకాట, కోడిపందాలు జరుగుతున్నాయని తెలిపారు. నూజివీడు మండలం సంకొల్లు, తుక్కులూరు, పోతిరెడ్డిపల్లి, ఆగిరిపల్లి మండలంలో ఈదర, కనసనపల్లి, తాడేపల్లి, చొప్పల మెట్లతో పాటు ముసునూరు మండలంలో గుర్రాలమ్మ గుట్ట ప్రాంతాల్లో ఈ జూదాలు నడుస్తున్నాయని వార్తలు రావడంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రాత్రివేళ కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు ప్రచారాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆగిరిపల్లిలో గతంలో నడిపి మూతబడిన జూదశాల తిరిగి ప్రారంభించడం అన్యాయమని తెలిపారు. తక్షణం దాన్ని మూసివేయాలని, వాటికున్న అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటివల్ల యువత భవిష్యత్తు నాశనం కావడమే కాకుండా ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా దెబ్బతింటారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆర్థిక స్థితిగతులను నాశనం చేసే ఈ జూదాలను ఉక్కుపాదంతో పోలీసు ఉన్నతాధికారులు అణిచివేయాలని, పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రవి డిమాండ్ చేశారు.

10న జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

మొంథా తుపాను నష్టాల పరిశీలన - జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో మొంథా తుపాన్ నష్టాల పరిశీలనకు కేంద్ర ప్రభుత్వం నియమించిన పరిశీలన బృందం ఈ నెల 10వ తేదీన జిల్లాలో పర్యటించనుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2.30కు గన్నవరం నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు ఏలూరు జిల్లా ఉంగుటూరు చేరుకుంటుందని తెలిపారు. ఉంగుటూరులో తుపాన్ నష్టాలు, అనంతరం జిల్లా యంత్రాంగం చేపట్టిన పునరుద్ధరణ పనులపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారని, అనంతరం ఉంగుటూరు మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించి మొంథా తుపాన్ నష్టాలను అధికారులతో కలిసి పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం సాయంత్రం 4.30లకు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం బయలుదేరి వెళతారని కలెక్టర్ తెలిపారు. బృందంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ కె.పొనుసామి, సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ శ్రీనివాసు బాత్రి, కేంద్ర విద్యుత్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్ కుమార్ మీనా సభ్యులుగా ఉన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ చేపట్టాలి

- ఐటిడిఎ పిఒపై చర్యలు తీసుకోవాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు, గిరిజనులకు అండగా ఉండాల్సిన ఐటిడిఎ పిఒ రాములునాయక్ కూటమి నాయకులతో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మండలంలోని గుంజవరంలో నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించే ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం విషయంలో స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని, దీనిపై ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. ఐటిడిఎ పిఒ గిరిజనులకు పెద్దదిక్కుగా ఉండాల్సిన అధికారులే ఈ రకమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కోవటం బాధాకరమని, వీటిపై తక్షణమే చర్యలు చేపట్టకపోతే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కుక్కునూరు మండలంలోని కొంతమంది కూటమి నాయకులతో కలిసి నిర్వాసితులు పరిహారం చెల్లించాలన్నా కమిషన్ ఇవ్వాలని, స్థానిక నాయకులతో మాట్లాడకపోతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరికలు చేయటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై కఠినమైన చర్యలు చేపట్టాలని వారు కోరారు. లేకపోతే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటస్వామి, ఎం.దుర్గారావు, రామిరెడ్డి, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

హాస్టల్లో విద్యార్థినిపై ఎలుకల దాడి ప్రభుత్వ నిర్లక్ష్యమే

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థినిపై ఎలుకల దాడి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్‌లో జరిగిన దారుణమైన ఎలుకల దాడి ఘటన పట్ల స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుందన్నారు. ఒక మహిళా విద్యార్థిని నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు దాడి చేసి, ఆమె ముఖం, చేతులు, కాళ్లపై తీవ్ర గాయాలు కలిగించడం అత్యంత దారుణమని, ఇది కేవలం ఒక వ్యక్తిగత దుర్ఘటన మాత్రమే కాదని, ప్రభుత్వ నిర్లక్ష్యమన్నారు. తక్షణం హాస్టల్‌లో స్వచ్ఛతా డ్రైవ్ నిర్వహించి హాస్టల్ గదులు, వంటశాల, డైనింగ్ హాల్ శుభ్రం చేయాలని, డ్రెయినేజీ వ్యవస్థలో పూర్తి శానిటైజేషన్, డీ-రాట్ కార్యక్రమం నిర్వహించాల డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినికి వైద్యం అందించి, మానసిక స్థైర్యం కోసం కౌన్సెలింగ్ అందించాలన్నారు. హాస్టల్ వార్డెన్, మెస్ సూపర్‌వైజర్, కళాశాల ప్రిన్సిపల్‌పై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మెడికల్ కాలేజీ హాస్టల్‌తో పాటు అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో రెగ్యులర్ పెస్ట్ కంట్రోల్, ఆధునిక డ్రెయినేజీ, వ్యర్థాల నిర్వహణ విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై 48 గంటల్లో పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు, ధర్నాలు, హాస్టల్ ముట్టడి, కళాశాల ముందు నిరసనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శివ, ఎం.జయంతు, పి.నాని తదితరులు పాల్గొన్నారు.

11న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఈ నెల 11వ తేదీన సిఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన, ఒక ఎంఎస్ఎంఇ పార్క్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. ఈ నెల 11వ తేదీన కనిగిరిలో సిఎం చంద్రబాబు 60 పారిశ్రామిక ప్రాజెక్టులు, 51 ఎంఎస్ఎంఇలు ప్రారంభోత్సవంలో భాగంగా ద్వారకాతిరుమల మండలంలో రూ.208 కోట్లతో ఏర్పాటు కానున్న గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్‌ను, నూజివీడు మండలంలో రూ.110 కోట్లతో ఏర్పాటు కానున్న రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్‌లను సిఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో 20 ఎకరాల్లో ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఇ పార్క్‌ను కూడా సిఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. గోద్రేజ్ ద్వారకాతిరుమల మండలంలో ఆగ్రోవెట్ లిమిటెడ్ వారు ఏర్పాటుచేసే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా 366 మందికి, నూజివీడు మండలంలో రమణసింగ్ గ్లోబల్ ఫుడ్ పార్క్ ఏర్పాటు ద్వారా 1500 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని తెలిపారు.

లీగల్ సర్వీసెస్ యాక్ట్‌తో ఉచిత న్యాయ సహాయం

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

1987లో రూపొందించిన లీగల్ సర్వీసెస్ యాక్ట్ ప్రకారం బడుగు బలహీన తరగతుల వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తారని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.లక్ష్మీపార్వతి తెలిపారు. నూజివీడు పట్టణ పరిధిలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.లక్ష్మీపార్వతి పాల్గొని మాట్లాడుతూ ధనికులతో పాటు సమానంగా పేదవారికి కూడా సమాన న్యాయం అందాలనే ఉద్దేశంతో 1987లో లీగల్ సర్వీసెస్ యాక్ట్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ చట్టం 1995 నవంబర్ తొమ్మిదో తేదీ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం బడుగు బలహీన తరగతుల వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తారన్నారు. అలాగే వారి కేసులు ఉచితంగా వాదించటానికి ఈ సంస్థ నుంచి న్యాయవాదిని కూడా నియమిస్తారన్నారు. ప్రామిసరీ నోటు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. అందరూ కష్టపడి చదువుకుని మంచి ఉద్యోగాలు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎస్‌కెడి.ప్రసాద్, వార్డెన్ ఆర్.సంధ్యారాణి, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.లక్ష్మీపార్వతి

పట్టిసీమ నుంచి 700 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 700 క్యూసెక్కుల నీటిని పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిఇ సురేష్‌బాబు తెలిపారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడం వల్ల కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు ఖరీఫ్ సీజను సాగు నీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు పంపులు, రెండు మోటార్ల ద్వారా నీరు పంపిణీ చేస్తున్నట్లు, త్వరలో మరికొన్ని మోటార్లను కూడా ఆన్ చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



విడుదలవుతున్న నీరు

ఎస్ఐ కొట్టారని పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - కలిదిండి

పోలీస్‌స్టేషన్‌లో బాధితుల బంధువులు

ఎస్ఐ కొట్టారని పోలీస్‌స్టేషన్‌లో బంధువులు ఆందోళనకు దిగారు. కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామానికి చెందిన వెర్రిచర్ల వెలంగిణి, భూపతి జయరాజు, భూపతి రాజు మండలంలోని కోరుకొల్లులోని కలిదిండి రోడ్డు వద్ద ఉన్న కిరాణా షాపు వద్ద మద్యం తాగుతున్నారని, పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు చెప్పారు. దీంతో వారికి, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్ఐ వారిని కొట్టారని పోలీస్‌స్టేషన్ వద్ద చేరుకున్న వారి బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకుని స్టేషన్‌కు చేరుకున్న కైకలూరు రూరల్ సిఐ రవికుమార్ వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. బాధితుల్లో ఒకరైన భూపతి జయరాజు మూడు నెలల క్రితమే హార్ట్ సర్జరీ చేయించుకున్నారని బంధువులు తెలిపారు. జయరాజును నోటి నుంచి రక్తం వచ్చేలా కొట్టారన్నారు. ఆయనకు సమీప హాస్పటల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు బంధువులు తెలిపారు.

పెదపాలపర్రులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పారిశుధ్య పనుల్లో సిబ్బంది

తుపాను ప్రభా వంతో కురిసిన భారీ వర్షాలు కారణంగా మండలంలోని పెదపాల పర్రులో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామని గ్రామ సర్పంచి గంటా రాకేష్ కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామంలో గత రెండు రోజులుగా దోమల నిర్మూలన కార్యక్రమం, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. దీపావళికి ముందు, ఆ తరువాత తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిందన్నారు. దీంతో గ్రామస్తులకు ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టామన్నారు. భారీ వర్షాల కారణంగా గ్రామంలో వీధుల వెంబడి నిల్వ ఉన్న వరద నీటిని బయటకు మళ్లించామన్నారు. మురుగు కాలువల్లో నీరు లేకుండా చేసి బ్లీచింగ్ చల్లే పనులు జరిగాయన్నారు. అదే విధంగా ప్రధాన గ్రామంతో పాటు గ్రామంలోని పలు కాలనీల్లో, ఎస్‌సి ఏరియాలో, శివారు గ్రామమైన చిన్న ప్రత్తిపాడులో కూడా ప్రతి వీధిలో నిల్వ ఉన్న నీటిని తొలగించి డ్రెయినేజీల్లో పూడికతీతతో పాటు బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు గ్రామమంతా ఫాగింగ్ మిషన్‌తో పిచికారీ చేశామన్నారు. గ్రామంలోని వీధుల వెంబడి, నివాస ప్రాంతాల్లో ఎలాంటి దుర్గంధం లేకుండా పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకున్నామన్నారు. మంచినీటి చెరువుల్లో క్లోరినేషన్ చేసి స్వచ్ఛమైన నీటిని గ్రామస్తులకు సరఫరా చేస్తున్నట్లు సర్పంచి రాకేష్‌కుమార్ తెలిపారు. ఈ పనులను సర్పంచితో పాటు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి గోవర్ధన్‌రావు పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో రైతు సాధికార సంస్థ అధ్వర్యంలో బయో రీసెర్చ్ సెంటర్‌ను ఎంఎల్ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడి తగ్గి రైతుకు దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా రీసెర్చ్ సెంటర్‌లో రైతులకు అవసరమైన కాషాయలు, జీవామృతం అందుబాటులో ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పైదా ముత్యాలమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.వసంతరావు, సొసైటీ అధ్యక్షులు ఎస్.సత్యనారాయణరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

250 మంది స్వాములకు అన్నదానం

ప్రజాశక్తి - ముదినేపల్లి

భోజనం చేస్తున్న స్వాములు

ముదినేపల్లిలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం సర్వమాలధారులకు బిక్ష ఏర్పాటు చేశారు. పేరూరు గ్రామ మాజీ సర్పంచి సోమ సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో 250 మంది స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దారుణం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ చేయడం దారుణమని నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం జగన్ ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని పాత రావిచెర్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చి, పేద కుటుంబాలకు వైద్య, విద్య అభ్యసించే అవకాశాన్ని కల్పించిన ఏకైక సిఎం జగన్ అన్నారు.

కంచె తొలగించాలంటూ ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్ల రాజుపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తగూడెం జగనన్న కాలనీకి వెళ్లే దారికి అడ్డంగా కంచె వేయడంతో స్థానిక కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేశారు. జగనన్న కాలనీ నిర్మాణ సమయంలో దారి ఏర్పాటు చేయకుండా కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారని, ఆ దారి భూమి నాదని స్థానిక రైతు దారికి అడ్డంగా కంచె వేశాడు. దీంతో కాలనీకి వెళ్లడానికి రాకపోకలు నిలిచిపోవడంతో స్థానికులు ఆందోళన చేశారు. ఈ విషయంపై విఆర్‌తో దత్తును వివరణ కోరగా సమస్య పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

నేరాలు - ఘోరాలు

మహిళ అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళ అదృశ్యంపై టి.నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం.... మండలంలోని మక్కినవారిగూడెం పంచాయతీలోని కొల్లివారిగూడెం గ్రామానికి చెందిన వివాహిత కుశిని నాగమణి (30) మక్కినవారిగూడెం గ్రామంలో బట్టల షాపు పెట్టి నడుపుతుంది. గత వారం రోజుల నుంచి ఆమె భర్త అప్పు చేసి షాపులోకి స్టాక్ తీసుకురావొద్దు. ఉన్న సరుకునే అమ్ముకో ఇప్పటికే చాలా అప్పులు అయ్యాయని మందలించడంతో నాగమణి ఈ నెల ఆరో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు బట్టల షాపు దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. నాగమణి తండ్రి గోపిన మద్ది రాములు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని స్వర్ణవారిగూడెం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం కోడిపందేల స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని స్వర్ణవారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పలువురు పరారవ్వగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1570 నగదు, ఒక కోడి, కోడి కత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ముసునూరు తహశీల్దార్ డి.ప్రశాంతి

చిట్ చాట్

ప్రజాశక్తి - ముసునూరు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని ముసునూరు తహశీల్దార్ డి.ప్రశాంతి అన్నారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, భూ వివాదాల పరిష్కారం వంటి అంశాలపై ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న : మండలంలో ప్రధాన సమస్యలు ఏమిటి?

తహశీల్దార్ : ప్రధానంగా మండలంలో ఇళ్ల స్థలాల సమస్య ఉంది. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా చూడాల్సిన స్థలాలు ఇంకా సమకూర్చలేకపోవటం, కొన్ని గ్రామాల్లో జగనన్న కాలనీలు ఊరికి దూరంగా ఉండటం వంటివి పరిశీలించాలి.

ప్రశ్న : ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో చేరేందుకు మీరు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

తహశీల్దార్ : పథకాలు అందేందుకు లబ్ధిదారులకు సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నాం. మిగిలినవి ఆయా శాఖల సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులందరికి అందిస్తున్నాం.

ప్రశ్న : రేషన్, పింఛన్లు, హౌసింగ్ వంటి పథకాల పంపిణీలో ఏమైనా కొత్త మార్పులు చేశారా?

తహశీల్దార్ : పింఛన్లు, కొత్త రేషన్ కార్డులకు అర్హులైన వారందరికీ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం. అలాగే హౌసింగ్‌కు సంబంధించిన పొజిషన్ సర్టిఫికేట్ పత్రాలు పెండింగ్ లేకుండా చూసి, హౌసింగ్ కార్యాలయాలకు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం.

ప్రశ్న : ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడంలో మీ ప్రాధాన్యత ఏమిటి?

తహశీల్దార్ : పేదల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో నిర్ణీత గడువు లోపల పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న : భూ వివాదాలు తగ్గించడానికి మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

తహశీల్దార్ : క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇరు గ్రూపులతో మాట్లాడి సమన్వయ పరుస్తున్నాం.

ప్రశ్న : రెవెన్యూ రికార్డుల్లో తప్పొప్పులు లేకుండా ఏ విధంగా చూస్తున్నారు?

తహశీల్దార్ : రెవెన్యూ రికార్డుల్లో వన్ బి, అడంగల్, లింక్ డాక్యుమెంట్లు ద్వారా రైతులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాం.

ప్రశ్న : పాసు పుస్తకాలు ఎన్ని రోజుల్లో మంజూరు చేస్తున్నారు?

తహశీల్దార్ : ఆన్‌లైన్ ద్వారా రైతు నమోదు చేసిన వెంటనే కాకుండా, క్షేత్ర పరిశీలనలో భాగంగా పొలం సరిహద్దుదారుల వారితో చర్చించి 15 రోజుల నుంచి నెల రోజుల్లో లోపల పాస్ పుస్తకం వచ్చేలా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : రెవెన్యూ సిబ్బంది, విఆర్ఒ ఆయా గ్రామాల్లో సర్వీసు ఎలా చేస్తున్నారా?

తహశీల్దార్ : రెవెన్యూ శాఖాధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో భూ సమస్యలనుర పరిష్కరిస్తున్నాం.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఉన్న గత 30 సంవత్సరాలుగా ఉన్న పాత విద్యుత్ లైన్ సామర్థ్యం పెంచుతున్న రీత్యా ఈ నెల పదో తేదీన ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఆ సమయంలో పొట్టి శ్రీరాములు బొమ్మ, ద్వారకా సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, హనుమాన్ జంక్షన్ రోడ్లలో నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను కేంద్రంగా పని చేస్తున్న శ్రీ విఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి స్థానికంగా ఉన్న వికలాంగులకు దాతల సహకారంతో అందిస్తున్న సేవలు అభినందనీయమని, ఇతరులకు ఆదర్శప్రాయమని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సేవా సమితి ద్వారా ప్రతి నెలా 60 మంది వికలాంగులకు సన్న బియ్యం, నిత్యావసరాలు, పండ్లు, దుస్తులు అందిస్తున్నారు. ఇదే క్రమంలో కార్పొరేట్ వైద్యశాలల సహకారంతో వైద్య సేవలను సైతం అందిస్తున్నారు. ప్రతి నెలా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం సేవా సమితి ద్వారా సహకారం పొందుతున్న వికలాంగులతో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎతో పాటు ఆప్కాబ్ ఛైర్మన్ పాల్గొన్నారు. ఈ నెలలో వికలాంగులకు అందించే బియ్యం, నిత్యావసరాలు, ఇతరాలకు దాతగా ఆప్కాబ్ ఛైర్మన్ వ్యవహరించారు. ప్రముఖుల భాగస్వామ్యంతో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్తీక వన సమారాధన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి సేవా సమితి నిర్వహణ కోసం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను సొసైటీ ఛైర్‌పర్సన్ బత్తిన కొండబాబు, అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు బంటు విజయకుమార్, ప్రముఖులు దాట్ల సీతారామరాజు, కరణం పెద్దిరాజు, దూసనపూడి పుల్లయ్య నాయుడు, పట్నాల వెంకటేష్ బాబు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్తీక వనసమారాధనలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మానవుల మనుగడకు, మానవత్వం మెరుగుపడడానికి ఈ వన సమారాధనలు అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నూజివీడు నియోజకవర్గ యాదవులు, పద్మశాలీల సోదరుల వన సమారాధన, ఎంప్లాయిస్ కాలనీ వాసుల వన సమారాధనలో ముఖ్యఅతిథిగా మంత్రి కొలుసు పార్థసారధి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి తరపున, అన్ని సామాజిక తరగతుల కలయిక కోసం ఇలాంటి వనసమారాధనలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. అనంతరం మంత్రిని సంఘ నాయకులు, పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వై.ప్రసాద్, సిహెచ్.దుర్గాప్రసాద్, సాయి, మాధవరావు, సతీష్, శ్రీను, వెంగళరావు లోకేష్, సాంబశివరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడాలిలో వైభవంగా గౌడ సంఘ కార్తీక వన సమారాధన

ముదినేపల్లి : గౌడ సంఘీయులంతా ఐకమత్యంగా ఉండాలని, సంఘం సంఘటితంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకుంటే ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చెందుతామని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వడాలి శ్రీ సుభద్ర బలరామ సహిత శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘ 21వ కార్తీక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏ లిటిల్ ఫ్లవర్ ది లీడర్ స్కూల్ అధినేత, గౌడ సంఘ నాయకులు బొర్రా చలమయ్య సభాధ్యక్షత వహించగా, పెడన ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాద్, తెలంగాణ ఐజీ వెలివెల సత్యనారాయణ, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, రాష్ట్ర గౌడ సంఘ నాయకులు కొనకళ్ల జగన్నాధరావు (బుల్లయ్య), పోసిన చెంచు రామారావు, టిడిపి కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పరసా ఏడుకొండలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పది వేల మందికి పర్యావరణ రహితంగా అరటి ఆకులో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు దాత మోదుగుమూడి మదన్ మోహన్ కుమార్తె శ్రీమణికంఠ పేర్ల మీద రూ.ఐదు వేల చొప్పున ఐదుగురు విద్యార్థులకు రూ.25 వేల నగదు బహుమతి అందించి సత్కరించారు. సభాధ్యక్షులు బొర్రా చలమయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు చలపాటి వెంకటేశ్వరరావు, తాతా కృష్ణారావు, పరసా వీర్రాజు, కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘ అధ్యక్షులు పోలగాని నాగరాజు, జోగి సురేష్, సొంటి నాగరాజు, ఈడే సుధాకర్, దాసరి శ్రీనివాస్, కైకలూరు, కలిదిండి మండవల్లి, ముదినేపల్లి మండలాల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో...

ఆర్యవైశ్య సంఘ అభివృద్ధికి కృషి

టి.నరసాపురం :ఆర్యవైశ్యుల సంక్షేమ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని టి.నరసాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అద్దంకి గిరికుమార్ అన్నారు. ఆదివారం గిరికుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ముత్యాలమ్మ పేటలో అద్దంకి జగ్గారావ్‌తోటలో ఆర్యవైశ్యుల వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని అలరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి సంఘ సభ్యులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరి కుమార్ మాట్లాడుతూ సంఘం అధ్యక్షునిగా మరోసారి తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషదాయకం అన్నారు. వన భోజనాల అనం తరం సంఘం ఏర్పాటుచేసిన 20గ్రాముల సిల్వర్ లక్కిడ్రాలో సంఘ మాజీ కార్యదర్శి అద్దంకి రవి సతీమణి సౌజన్య గెలుపొందారు. ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు మండం మూర్తి, మండల ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు పసుమర్తి రాము, మాజీ వైస్ ఎంపిపి అద్దంకి జగ్గారావు చేతులమీదుగా బహుమతి రవి దంపతులకు అందించారు.

CHANGE OF NAME
I, KOTHAPALLI RAMESH S/o KOTHAPALLI SUBBARAO shall henceforth be known as KOTTAPALLI RAMESH S/o KOTTAPALLI SUBBARAO.

ఏజెన్సీలో టీచర్ పోస్టులను ఆదివాసీలకే కేటాయించాలి

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - కుక్కునూరు

ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్ పోస్టులను ఆదివాసీలకు మాత్రమే కేటాయించాలని, షెడ్యూల్డ్ ఏరియాల్లో ఉద్యోగ నియామక చట్టం తీసుకొచ్చి 2022లో సుప్రీంకోర్టు రద్దు చేసిన జిఒ ఎంఎస్ 3ని పునరుద్ధరించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. మండలంలోని నెమలిపేట ఎంపిపిఎస్‌యు స్కూల్‌లో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఎటిఎ) ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సోడే వెంకటనారాయణ, జిల్లా నాయకులు కారం దారయ్య మాట్లాడుతూ ఆదివాసీ యువత ఇప్పటికే ఉద్యోగ రంగంలో అడుగుపెడుతున్న తరుణంలో పోస్టులను ఏజెన్సీ నుంచి దూరం చేయడం సరికాదని, నిరుద్యోగ సమస్య తీవ్రతరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బంధం వీరబాబు, శీలం వెంకటేశ్వర్లు, బంధం ముత్యాలరావు, బంధం వెంకటేశ్వర్లు, చిదర రాధ, మచ్చా సీత, సోడే నరేష్, వర్స రమేష్, మడకం మహేష్, సోడే వెంకటేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో ఎటువంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు అనుమతి లేదని ఎవరైనా కోడిపందాలు, ఎటువంటి సంఘవిద్రోహ కార్యక్రమాలు చేపట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. ప్రజలు మీ పరిధిలో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు, కోడిపందేలు, పేకాట మీ దృష్టిలోకి వస్తే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గంలోని పడమర వీధి, వంగాయగూడెం సెంటర్ దగ్గర శ్రీ నారాయణ దత్త ఎడ్యుకేషనల్ వారి సహకారంతో ఏలూరు ఆశ్రం హాస్పిటల్, 17, 18వ డివిజన్ జనసేన కమిటీ వారి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో ఒపి, బిపి, షుగర్ పరీక్ష, ఇసిబి, ఎక్స్ రే, కొన్ని రరాల రక్తపరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ (పొట్ట స్కాన్), మహిళలకు కేన్సర్‌కు సంబంధించి పాప్ స్మీర్, స్క్రీనింగ్ పరీక్షలు ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పల నాయుడు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగాయగూడెంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు, జనసేన పార్టీ 17, 18వ డివిజన్ కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక ప్రెసిడెంట్ వీరంకి త్రినాథరావు, సెక్రటరీ మరీదు వెంకటలక్ష్మి, డైరెక్టర్ వీరంకి అంజిత్‌కుమార్ పండు, పల్లి విజయ్, జనసేన నాయకులు సరిది రాజేష్, ఎత్రించి ధర్మేంద్ర, బెజవాడ నాగభూషణం కుమార్, స్థానిక వంగాయగూడెం జనసైనికులు, పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) ఆధ్వర్యంలో విజయ హాస్పిటల్స్ రితేష్ హార్ట్ కేర్ ఏలూరు వారి సహకారంతో ఆదివారం ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో గుండె, నేత్ర జనరల్ వైద్య విభాగాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని 150 మందికి పైగా నగరవాసులు సద్వినియోగం చేసుకున్నారు. ప్రముఖ హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ పి.రితేష్ నేతృత్వంలో గుండె పరీక్షలు, నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ జి.తేజస్వి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, ఫిజీషియన్ డాక్టర్ ఎం.రాంబాబు జనరల్ పరీక్షలు చేశారు. ముందుగా జరిగిన సభా కార్యక్రమంలో డాక్టర్ రితేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకసారైనా గుండె పరీక్షలు చేయించుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకుంటే ముందుగానే హార్ట్ ఎటాక్ బారిన పడకుండా ఉంటారని తెలిపారు. వైఎంహెచ్ఎ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ వైఎంహెచ్ఎ సంస్థ పక్షాన ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసం మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం వైద్య బృందాన్ని నిర్వాహకులు శాలువా మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ వైద్య శిబిరంలో గుండెకు సంబంధించి ఇసిజి, ఎకో, కంప్యూటర్‌పై కంటి పరీక్షలు, బిపి, షుగర్, ఉచితంగా నిర్వహించి మందులను అందించారు.

కొయ్యలగూడెం : మండలంలోని బయ్యన్నగూడెం గ్రామంలో ఆర్‌సిఎం చర్చి ఆవరణలో ఏలూరు పీఠాధిపతులు పొలిమేర జయరావు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం నిర్మల హాస్పిటల్ మల్టీ స్పెషాలిటీ, లాప్రో స్కోపీ సెంటర్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువు రాజులపాటి రోసారియో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదవారికోసం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనసేన పార్టీ నాయకులు మద్దతేజ విశ్వనాధ్, టిడిపి మండలాధ్యక్షుడు పారేపల్లి నరేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రజలకు అంతుచిక్కని వ్యాధులు సంక్రమిస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల వద్దకు గ్రామీణ ప్రాంత ప్రజలు వచ్చి తమ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ మల్లిపూడి శంకరం, మిరియాల అంబేద్కర్, ఆరేటి ఏసు, డాక్టర్ బిందు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు
FCOP 287/2024
Between:-
సాగి ఈశ్వరమ్మ ...పిటీషనరు
మరియు
సాగి సురేష్ రాజు ...రెస్పాండెంటు
టు.
సాగి సురేష్ రాజు, తండ్రి పద్మరాజు, డోర్‌నెం.5-59, రాజులరామాలయం వద్ద, శృంగవృక్షం, పాలకోడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా 534243
పై దావా సాగి ఈశ్వరమ్మగారు మీ పై విడాకులు కోరుచూ **13-08-2014** తేదీన మీ ఇద్దరికి జరిగిన వివాహమును రద్దు చేయవలసిందిగా పై కోర్టులో దావా వేసియున్నారు. కావునా మీరు పై రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు నందు **15-12-2025** ఉదయం **10.30 గంIIలకు** హాజరు కావలసియున్నది. మీరు రాని యెడల మీకు వ్యతిరేకంగా పరోక్షముగా తీర్పు చెప్పబడును. తప్పక హాజరు కావలెను.
G.U.V.B.రాజు
వాది తరుపు అడ్వకేట్
వీవర్సు కాలనీ, రాజమండ్రి
సెల్.9848370855

మహారాజశ్రీ రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు
FCOP 214/2023
Between:-
సాగి ఈశ్వరమ్మ
సాగి ఆద్విక(మైనర్ తరుపున తల్లి) ...పిటీషనర్లు
మరియు
సాగి సురేష్ రాజు ...రెస్పాండెంటు
టు.
సాగి సురేష్ రాజు, తండ్రి పద్మరాజు, డోర్‌నెం.5-59, రాజులరామాలయం వద్ద, శృంగవృక్షం, పాలకోడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా 534243
పై కోర్టులో సదరు దావాలో పిటిషనర్లు మనోవర్తి కోరుచూ మీ పై దావా వేసియున్నారు. ది.**15-12-2025** మీరు హాజరు కొరకు వాయిదా అయివున్నది. కావునా మీరు పై రాజమండ్రి ఫ్యామిలీ కోర్టు నందు **15-12-2025** ఉదయం **10.30గంIIలకు** హాజరు కావలసి యున్నది. మీరు రాని యెడల మీకు వ్యతిరేకంగా పరోక్షముగా తీర్పు చెప్పబడును. తప్పక హాజరు కావలెను.
G.U.V.B.రాజు
వాది తరుపు అడ్వకేట్
వీవర్సు కాలనీ, రాజమండ్రి
సెల్.9848370855

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల పదో తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) నిర్వహించనున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మండల, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇంటి నుంచి ప్రభుత్వ అధికార వెబ్‌సైట్ http://meekosam.ap.gov.in ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు అన్వర్‌జహాన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు మండలంలోని శనివారపుపేటలోని ఉర్దూ పాఠశాలలో సెకండ్ గ్రేట్ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్‌కె.అన్వర్‌జహాన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉర్దూ అకాడమీ వారు ప్రదానం చేసే రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె ఈ నెల 11వ తేదీన విజయవాడలో ఉన్న తుమ్మల కళాక్షేత్రంలో రాష్ట్ర ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్‌కెవిఎస్.మణి, ఎల్.కనకదుర్గ, మండల శాఖ నాయకులు ఎస్‌కె. సుభాని బేగం, ఎస్‌కె.పూరాఖాన్, పి.సురేష్‌బాబు, బాలభాస్కర్ అభినందనలు తెలిపారు

పాస్‌పోర్టు పోయినది

దొంగ ఆదిత్య, తండ్రి.: శ్రీనివాస రావు, డోర్ నెంబర్ 8-133(2), అల్లంగుంట, పెనుమదం గ్రామం, పోడూరు మండలం, ప.గో.జిల్లా,ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది 05-06-2023లో వైజాగ్ పాస్ పోర్ట్ ఆఫీస్ నుంచి Y5006690 నెంబర్ పాస్ పోర్ట్ పొంధియున్నాను. ది 03-11-2025న అల్లంగుంటలోని మా ఇంటి నుంచి పెనుమదంలోని జెరాక్స్ సెంటర్‌లో నా పాస్ పోర్ట్ జెరాక్స్ తీయించుటకు బైక్‌పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ పడి పోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు నా ఒరిజినల్ పాస్ పోర్ట్ అందజేయగలరు.
నా సెల్ నెంబర్ **9676711397**

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) JUDGE - CUM - JUDICIAL MEGISTRATE OF 1st CLASS : BHIMAVARAM
F.D.P.I.A.No.6/2024 in O.S.No.723/2005
Petitioners/ Plaintiffs : Grandhi Varalakshmi and another
1.Cell No.8985457999,
2.Cell No.9247296199
Respondents : Sannidhi Sri Rama Chandra Murthy and Others
RESPONDENTS/DEFENDANTS:
9.Sannidhi Srinivasu, S/o.Venugopala Rao, "S" Turning, Main Road, Akividu, Akividu Mandal.
17. Bandaru Venkayamma, W/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.
18.Bandaru Suresh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.
19. Bandaru Ramesh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.
21.Sannidhi Eswari, W/o.(Late) Lakshmi Gupta, R/o.'S' Turning, Main Road, Akividu, Akividu Mandal.
పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో పిటీషనర్లు, 9,17 to 18,19 మరియు 21 రెస్పాండెంట్లుకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను నోటీస్లు జారీ చేయించినప్పటికి 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీరు సదరు నోటీస్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. సదరు ఫైనల్ డిక్రీ పిటీషనులో 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం కోర్టు వారు ది.20-11-2025 సంIIరం తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీ ఉదయం గం.10.30 నిIIలకు పైకోర్టు వారి ఎదుట 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయ్యి మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల రెస్పాండెంట్లు 9,17 to 19 and 21 అయ్యి మీ పరోక్షమందు సదరు పిటీషను తీర్మానించడమగును.
K.V.Suryanarayana
Advocate, Sarrajuvari Street,
Bhimavaram -534201, A.P.
Cell: 98494 04488.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) JUDGE - CUM - JUDICIAL MEGISTRATE OF 1st CLASS : BHIMAVARAM
I.A.No.812 of 2024 in F.D.P.I.A.No.6/2024 in O.S.No.723/2005
Petitioners/ Plaintiffs : Grandhi Varalakshmi and another
1.Cell No.8985457999,
2.Cell No.9247296199
Respondents : Sannidhi Sri Rama Chandra Murthy and Others
RESPONDENTS/DEFENDANTS:
9.Sannidhi Srinivasu, S/o.Venugopala Rao, "S" Turning, Main Road, Akividu, Akividu Mandal.
17. Bandaru Venkayamma, W/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.
18.Bandaru Suresh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.
19. Bandaru Ramesh Kumar, S/o.(Late) Rama Rao, R/o.Muslim Street, Akividu, Akividu Mandal.
21.Sannidhi Eswari, W/o.(Late) Lakshmi Gupta, R/o.'S' Turning, Main Road, Akividu, Akividu Mandal.
పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్లు, 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయ్యి మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను నోటీస్లు జారీ చేయించినప్పటికి 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీరు సదరు నోటీస్లు తీసుకోకుండా తప్పించు కొనుచున్నారు. సదరు పై నెంబరు పిటీషనులో 9,17 to 19 and 21 రెస్పాండెంట్లు అయిన మీ హాజరు నిమిత్తం పై నెంబరు పిటిషనును కోర్టు వారు ది.20-11-2025 సంIIరం తేదీకి వాయిదా వేసినారు. సదరు వాయిదా తేదీ ఉదయం గం.10.30 నిIIలకు పైకోర్టు వారి ఎదుట 7,17 to 19 and 21 రెస్పాండెంట్లు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిఎడల కోర్టు వారు పై నెంబరు పిటీషనును 7,17 to 19 and 21 రెస్పాండెంట్లు పరోక్షమందు తీర్మానించడమగును.
K.V.Suryanarayana
Advocate, Sarrajuvari Street,
Bhimavaram -534201, A.P.
Cell: 98494 04488.